క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో పంచాయతీ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను డ్రైన్లలో పూడికతీత తొలగించి, గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ముగిసిన షిర్డీసాయి నవరాత్రులు

కోటనందూరు: స్థానిక శివాలయం ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీషిర్డీ సాయిబాబా నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం పండితులు బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున సాయిబాబును దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, భక్తుల సహకారంతో నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆకట్టుకున్న వీధి నాటకాలు



తాటకి వధ వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరి శంకరుల 89వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు తాటకి వధ వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో శ్రీరాముడుగా పడాల నాని, లక్ష్మణుడుగా చెన్నాడ వెంకటరమణ, విశ్వామిత్రుడుగా మట్టా లక్ష్మణరావు, తాటకిగా చెన్నాడ శివ తాతారావు నటించారు.

జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టుకు శంకుస్థాపన



ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామం వద్ద రూ 3.49 కోట్లతో నిర్మాణ వ్యయంతో జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం శంఖుస్థాపన చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పుష్కర ఆయకట్టులో శివారు భూములుగా వున్న 3,500 ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. పురుషోత్తపట్నం పైపు లైను ద్వారా ప్రాజెక్టుకు సాగునీరు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిఈ కె.నరసింహమూర్తి, ఎస్ఈ డి.ఏసుబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సువార్తను విస్తరింపచేయాలి

ఏలేశ్వరం: ప్రపంచ పాస్టర్ల అప్రియేషన్ డేను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంద్రూస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బిషప్ జోసఫ్ ఆంద్రూస్, శామ్యూల్ ఆంద్రూస్‌లను సంఘస్తులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనలను సేవల్లో ఉంచినందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. మరిన్ని ప్రాంతాలకు సువార్తను విస్తరింపచేయాలన్నారు. దేవుని సేవలో ప్రతిఒక్కరూ ధన్యులు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘస్తులు పాల్గొన్నారు.

నేడు కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

ప్రత్తిపాడు రూరల్: ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ గత రెండు రోజులుగా కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న ఆయన సోమవారం ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు కుమ్మరి శాలివాన సంఘం జిల్లా అధ్యక్షుడు పసలపూడి ప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో కుమ్మరి వృత్తిదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటారని కుమ్మరి శాలివాహన సంఘ సభ్యులు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వానరం.. జనాల కలవరం

- మండలంలో కోతుల స్వైర విహారం
- ప్రజలపైకి ఎగబడుతూ దాడులు
- నష్టపోతున్న రైతులు



గోకవరంలో ఓ ఇంటి దాబాపై గుంపుగా ఉన్న కోతులు

గోకవరం: మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. మనుషులు కనబడితే చాలు మీద దునుకుతూ దాడి చేస్తు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మనుషులు లేని సమయాల్లో ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను తీసుకెళ్లి రోడ్లపై పడేస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చిన వానరాలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించి కిందపడి కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యిన ఘటనలు అనేకం. మండల కేంద్రంతో పాటు గోకవరం, కొత్తపల్లి, కామరాజుపేట, రంపయర్రంపాలెం, కృష్ణునిపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. పరిసర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి.

రైతులకు తీవ్ర నష్టం

కోతుల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. మండలంలో రైతులు ఎక్కువగా పండ్లు, కూరగాయాలను సాగు చేస్తుంటారు. పంట చేతికొచ్చే సమయంలో కోతులు గుంపులు, గుంపులుగా తోటలు, పొలాల్లోకి చొరబడి పంటను నాశనం చేస్తున్నాయి. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతులకు భయపడి అనేక మంది పండ్లు, కూరగాయల సాగుకు దూరమయ్యారు. అదేవిధంగా గతంలో ప్రతీ ఇంటి ఆవరణలో పెరటి పంటలను పండించేవారు. కోతుల కారణంగా దాదాపు ప్రజలు పెరటి పంటలను సాగు చెయ్యడంలేదు. గతంలో ఏ ఇంట్లో చూసిన అరటి, జామ, బొప్పాయి వంటి పండ్ల చెట్లు దర్శనమిచ్చేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదంటే కోతులు ఏ విధంగా నష్టపరుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు శూన్యం

కోతుల నిర్మూలనకు గతంలో అనేక పర్యాయాలు అధికారులు చర్యలు చేపట్టినా అవి శాస్వత ఫలితాన్ని అందించలేదు. గోకవరంలో పలుమార్లు కోతుల నిర్మూలనకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బోన్లు ఏర్పాటు చేసి వందల సంఖ్యలో కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. అయినప్పటికీ యధావిధిగా అవి గ్రామంలోకి చొరపడుతున్నాయి. వానరాల నుంచి రక్షణకు పంచాయతీ, పట్టణాల పాలకులు, అధికారులు స్పందించి వాటిని పట్టి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టాలి. వాటి సంగతి పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసే చర్యలు తీసుకోవాలి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కోతులు పాడు చేసిన కొబ్బరికాయలను చూపుతున్న రైతులు

పంటలు ధ్వంసం



కోతుల వలన పండ్ల తోటలను నష్టపోతున్నాం. తోటల్లో పంట చేతికొచ్చే సమయానికి గుంపులు, గుంపులుగా వచ్చి పండ్ల తోటలను పాడు చేస్తున్నాయి. కొబ్బరి, మామిడి, జామ, ఇతర పండ్ల తోటలపై దాడి చేస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కోతులకు భయపడి చాలా మంది రైతులు పండ్ల సాగుకు దూరమయ్యారు. ఇదే పరిస్థితి కొనసాగితే పండ్ల సాగు చాలా కష్టం.

కొరిపల్లి అప్పలస్వామి, ఆదర్శరైతు, గోకవరం

చినుకు పడితే చిత్తడే..

- ప్రమాదాలకు నిలయంగా రావికంపాడు రహదారి
- టిప్పర్‌ల రాకపోకలతో రోడ్లు ఛిద్రం



లాటరైట్ లోడుతో టిప్పర్ లారీ

తొండంగి: మండలంలోని రావికంపాడు నుంచి కత్తిపూడి వెళ్లే రహదారిలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ద్విచక్రవాహనదారులు ఆ రహదారిలో ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. గ్రావెల్ మట్టి కారణంగా రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుండా ప్రత్తిపాడు నుంచి లాటరైట్ మట్టిని టిప్పర్ లారీలతో స్థానికంగా డంపింగ్ చేసి మళ్లీ అక్కడి నుంచి రైల్వేస్టేషన్ వద్ద వ్యాగన్లలో లోడింగ్ నిమిత్తం డంపింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వందలాది టిప్పర్ లారీల రాకపోకల కారణంగా ఈ రహదారి పూర్తి లాటరైట్ మట్టితో నిండిపోయి ఎర్రని రంగులో దర్శనమిస్తుంది. ఎండతీవ్రత ఉన్న రోజుల్లో ఎర్రటి దుమ్మూ ధూళితో కాలుష్యం వెదజల్లుతోంది. వాస్తవానికి టిప్పర్ లారీల లోడుపై తోటి వాహనదారులకు ఇబ్బంది లేకుండా టార్పాలను అమర్చి రాకపోకలు సాగించాలి. కానీ నిబంధనలు పాటించకుండా లాటరైట్ లోడును లారీలపై తరలిస్తున్నారు. దీనితో కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలౌతున్నారు. ఈ రహదారి నిర్వహణ అటు అధికారులు గానీ, ఇటు లాటరైట్ లీజ్‌దారులుగాని పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన రావికంపాడు రహదారి

‘బండ’ బాదుడు

కోటనందూరు: గ్యాస్ డెలివరీకి రవాణా చార్జీల పేరుతో అదనపు బాదుడు బాదడంపై వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కోటనందూరు మండలంలోని వినియోగదారులకు తునిలోని ఏజెన్సీల నుంచి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. సిలిండర్ ధర రూ.871 నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ డెలివరీకి ఐదు కిలోమీటర్ల లోపు రవాణా చార్జీ వసూలు చేయకూడదు. ఐదు నుంచి 20 కిలోమీటర్ల వరకూ రూ.20, 15 కిలోమీటర్లు ఆపై దూరానికి రూ.30 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. అయితే 20 కిలోమీటర్ల లోపు దూరమున్న కోటనందూరు మండలంలోని వినియోగదారుల నుంచి రూ.60 వరకూ వసూలు చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఈ రెండు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 81,942 కనెక్షన్లు ఉన్నాయి. అదనపు వసూళ్లపై మండల సరఫరా అధికారి రాజును వివరణ కోరగా రూ.30కి మించి రవాణా చార్జీలు వసూలు చేయకూడదని, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సిలిండర్లను తరలిస్తున్న ఏజెన్సీ వాహనం

భక్తిశ్రద్ధలతో అన్నసమారాధన



ఏలేశ్వరం పట్టణంలో అన్నప్రసదాలు స్వీకరిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రల ముగింపును పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో స్థానిక తోటవీధిలో సుమారు 3వేల మందికి అన్నదానం చేశారు. పలుప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అన్నప్రసాదము స్వీకరించారు. కార్యక్రమంలో కోరాడ సత్యనారాయణ, సామంతుల గోపి, కోరాడప్రసాద్, సామంతుల శ్రీనివాసరావు, కోరాడ కృష్ణమోహన్, పైల విజయ్‌కుమార్ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కోనేటి చెరువుగట్టు సత్తెమ్మ తల్లి గుడి వద్ద అన్నదానం నిర్వహించారు.

ఆయన సేవలు ప్రశంసనీయం

కిర్లంపూడి: దివంగత ఎంపీటీసీ కాళ్ల దొంగా బాబు ప్రజలకు చేసిన సేవలు ప్రశంసనీయం అని జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. దొంగబాబు కుమారులు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడ్డదారిలో హైట్ బ్యారియర్ల తొలగింపు



బారియర్ గేట్‌ను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

కిర్లంపూడి: భారీ వాహనదారులు టోల్‌ఫీజు ఎగ్గొట్టేందుకు బూరుగుపూడి నుంచి పోలవరం కాలువ గట్టుమీదుగా కృష్ణవరం జాతీయ రహదారికి చేరుకునేవారు. ఇది గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్థానిక రైతులో చర్చించి మూడు నెలల క్రితం పోలవరం గట్టుపై హైట్ బ్యారియర్స్‌ను ఏర్పాటు చేసి ఈ మార్గం గుండా వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. అప్పటి నుంచి ఈ అడ్డదారి గుండా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రొక్లెయిన్ సహాయంతో బారియర్ గేట్‌లను తొలగించినట్లు టోల్ ప్లాజా అధికారులు తెలిపారు. అధిక లోడ్‌తో వాహనాలు గట్టుపై వెళ్లడంతో గట్టు శిథిలావస్థకు చేరుకుంటుందని దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు వాపోయారు.

‘పెద మల్లాపురం’ను మండల కేంద్రంగా ప్రకటించాలి



ఆదివాసీ ఉద్యోగుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చెన్నాడ సత్తిబాబు

రౌతులపూడి: పెద మల్లాపురంను మండల కేంద్రంగా చేయాలంటూ అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని రాఘవపట్నం ఆశ్రమ పాఠశాల వద్ద గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటిమళ్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలతో పాటు తుని నియోజకవర్గం కోటనందూరు మండలంలోని గిరిజన గ్రామాలను, ప్రభుత్వం నాన్ నోటిఫైడ్ గ్రామాలను ప్రభుత్వం గుర్తించి పెద మల్లాపురం మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, ఐటీడీఏను ఏర్పాటు చేసి గిరిజనులు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను నెరవేర్చాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు పోలోజు వరహాలు, జర్తా ముసలయ్య, బాసర బాలరాజు, తరుము నాగేశ్వరరావు, ముర్ల దొంగబ్బాయి, పలువురు ఆదివాసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై నేడు నిరసన

సామర్లకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీ మద్యం రాకెట్ విపరీతంగా పెరిగిపోయిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత పిలుపు మేరకు సోమవారం ఉదయం పెద్దాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతామన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా నిర్వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యంపై ప్రజలను చైతన్యపరచడానికి నిర్వహిస్తున్న కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద హాజరుకావాలని తెలిపారు.

స్మృతులను నెమరు వేసుకుంటూ..



1990-95 సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–95లో చదువుకున్న విద్యార్థులందరూ అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 30 సంవత్సరాల తరువాత వారికి విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఒకే వేదికపై తీసుకొచ్చారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరు వేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల తీపి కబుర్లు, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. ఒకరికొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు తీసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులకు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులను ఒక చోటకు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన పలువురు తోటి స్నేహితులను సన్మానించారు.

ఉద్యానం..అధ్వానం

- మున్సిపాలిటీలో నిర్వహణ లోపం
- ప్రజలు ఆహ్లాదానికి దూరం
- పట్టించుకోని అధికారులు



స్థానిక షిర్డీ నగర్ గాంధీజీ విగ్రహం వద్ద పార్కులో పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: ఆహ్లాదం పంచే పార్కులు ఉద్యానం అరకొర వసతులతో సాగుతున్నాయి. ఉద్యానవనాలు ప్రజలకు సాంత్వన చేకూర్చలేక దిగాలు పడుతున్నాయి. నిర్వహణ కొరవడి నీరుగారుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితి. ఉద్యానాలను ప్రజలకు అనువుగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత అధికార యంత్రాంగంపై ఉంది. ఏలేశ్వరం పురపాలిక ఉద్యానాల పరిస్థితిపై సాక్షి ప్రత్యేకం కథనం

నగర పంచాయతీలో ఇదీ పరిస్థితి

పట్టణపరిధిలోని సుమారు పదివరకు పార్కులు ఉండగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం పట్టణ పరిధిలోని పంట భూములను, ఖాళీ స్థలాలను లే ఆవుట్‌లుగా మారిస్తే కొంతస్థలం పార్కుకు కేటాయించవల్సి ఉంటుంది. నగర పంచాయతీగా హోదా వచ్చిన నాటి నుంచి పట్టణంలో పలుచోట్ల లేఆవుట్‌లు వేశారు. వీటినిమిత్తం కేటాయించిన పార్కుస్థలాలు నిరుపయోగంగా మారాయి. దీనితో ఈ స్థలాలు కొన్నిచోట్ల అక్రమణలకు గురవుతుండగా మరికొన్ని చోట్ల తుప్పలు పేరుకుపోయాయి.

స్థానిక షిర్డినగర్ గాంధీజీ విగ్రహం వద్ద నిర్మించిన పార్కు తుప్పలు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో పచ్చదనం లేక ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు సెలవులొచ్చాయి. సాయంత్రం సరదగా పిల్లలను ఆడించేందుకు సమీపంలోని పార్కుకు తీసుకు వెళ్దామంటే ఆట వస్తువులు సరిగా లేవు. తాగునీటి వసతి, నీడ లేక ఇక్కట్లు తప్పడం లేదు. రోజంతా ఆలసిపోయి కాసేపు ఉపశమనం పొందేందుకు పార్కులు ఎంతోగానో ఉపయోగపడతాయి. పిల్లల శరీరదాఢ్యానికి ఆటస్థలాలు కీలకపాత్ర పోషిస్తాయి. పిల్లలతో పాటు వృద్ధులు స్వేదతీరడానికి పార్కులు ఎంతో దోహదపడతాయి. అలాంటి పార్కులు, వాటికి కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా స్థలాలు

పట్టణంలో పార్కులుగా కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారాయి. స్థానిక పెద్దవీధి, షిర్డినగర్ మహిళాసమాఖ్య భవనం, షిర్డినగర్ గాంధీజీ విగ్రహం, దిబ్బలపాలెం, తదితరప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. వీటితో పాటు కొన్నిప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. స్థలాలు చాలాచోట్ల అక్రమణలు గురయ్యే ప్రమాదం అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హంగులు తుద్ది త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



షిర్డీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలం

వినియోగంలోకి తేవాలి

పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు వినియోగంలోకి తీసుకురావాలి. పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. స్థలాలు ప్రజలు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించాలి.

కె.శ్రీనివాసరావు, ఏలేశ్వరం

28 ఏళ్ల అనంతరం ఆత్మీయ కలయిక



1997-98 బ్యాచ్ శ్రీ ప్రకాష్ బీఈడీ విద్యార్థులు

తుని: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నందు 1997–98 విద్యా సంవత్సరంలో బీఈడీ చేసిన నాటి విద్యార్థులు 28 సంవత్సరాల తరువాత ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా స్థిరపడిన వీరంతా ఒకచోటుకు చేరి వృత్తి ఒత్తిడిని వదిలేసి రోజంతా హుషారుగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ వ్యక్తిగత జీవిత పరిస్థితులను పరస్పరం పంచుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు మాట్లాడుతూ తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు బాధ్యతాయుతమైన విద్యారంగంలో ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు.